సిరులు కురిపించే శ్రీలక్ష్మి

- ప్రతి ఇంటా వెల్లివిరిసే సకల సౌభాగ్యం
- పెరిగిన ధరలతో ఇబ్బందులు
- పసిడికి రెక్కలు
- సందడిగా మారిన మార్కెట్లు

తాళ్లపూడి: సిరులు కురిపించే శ్రీలక్ష్మి..పసిపాపల చిరునవ్వుల్లో సంతాన లక్ష్మిం ఇల్లాలి ఆలనలో గృహలక్ష్మి..ఇలా అష్టలక్ష్మీలను తనలో ఆవాహన చేసుకుని వరలక్ష్మీగా అవతరించిన మాసం..అవనితరించిన మాసం శ్రావణం. ఈ శ్రావణ లక్ష్మి ఊరూరికీ ఊరికే రాదు..ఆషాఢంలో ఊరించిన మేఘాలను.. ఉరుములు మెరుపులతో కురిపిస్తూ వస్తుంది. శ్రావణ మేఘాలు.. హర్షాతిరేకాలకు ప్రతీకలని చెబుతారు..అందుకే శ్రావణ లక్ష్మి ఆగమించిన మాసంలో ప్రతిరోజూ ఓ వ్రతం పలకరిస్తుంది. ప్రతి వారం ఓ విశేషం కనిపిస్తుంది. ప్రతి ఇంటా సంతోషం వెల్లువిరుస్తుంది. ప్రతి ఇల్లాలూ సౌభాగ్యలక్ష్మీగా వాయినం ఇస్తుంది. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు ఈ వ్రతాన్ని జరుపుకుంటారు. వ్రతంలో భాగంగా, మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి, లక్ష్మీదేవిని పూజిస్తారు. కలశ స్థాపన చేసి, పూజ సామాగ్రితో అమ్మవారిని అలంకరించి, పండ్లు, పూలతో పాటు, సంప్రదాయ ఫలహారాలతో వ్రత పూజలు నిర్వహిస్తారు.



అమ్మకాలకు సిద్ధంగా ఉన్న పండ్లు

ఆకాశాన్నంటుతున్న ధరలు

తాళ్లపూడి మార్కెట్‌లో గురువారం పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు వివిధ గ్రామాల నుంచి మహిళలు విచ్చేశారు. దీంతో తాళ్లపూడి బజార్‌లో సందడి నెలకొంది. పూజ కోసం వరలక్ష్మీ వ్రతకల్ప పుస్తకాలు, నూతన వస్త్రాలు, బంగారు వరలక్ష్మీరూపుతో పాటు చామంతిపూలు, వివిధ రకాల పండ్లు, పత్రి మార్కెట్లో కొనుగోలు చేస్తూ కనిపించారు. పూజా సామాగ్రికి ఉపయోగించే పళ్లు, పూల, నిత్యావసరలు ధరలు గతంలో కంటే విపరీతంగా పెరిగాయని మహిళలు వాపోతున్నారు. జిల్లాలోని కడియపు లంక, కర్ణాటక నుంచి దిగుమతి చేసిన వాటిని వ్యాపారులు కొనుగోలు చేసి చిల్లరగా విక్రయిస్తారు. ప్రస్తుతం భారీ వర్షాలకు ఉత్పత్తి తగ్గిందని దింతో చామంతి పూలు ధరలు కిలో రూ.800 వరకు చేరిందని వ్యాపారులు అంటున్నారు. దింతో చామంతి 10 పువ్వులు రూ.40 లకు, కనకాంబరం మూర రూ.70 నుంచి 90 వరకు, డజను అరటిపళ్లు రూ.50 నుంచి 70 వరకు పెరిగి చుక్కలను తాకుతున్నాయని కోనుగోలుదారులు వాపోతున్నారు. యాపిల్ 3 రూ.100 ధర పలకగా, కిలో నల్ల ద్రాక్ష రూ.120, బత్తాయిపండ్లు 5 రూ.100, విడిగా ఒకటి రూ.15, దానిమ్మకాయ 3 రూ.300 లుగా పలికాయి.



వరలక్ష్మి దేవి రూపులు

కొండెక్కిన పసిడి

శ్రావణమాసం వచ్చిందంటేనే పుణ్యకాలం, పూజలు, శుభకార్యాల హడావుడి మొదలవుతుంది. ఈ సమయంలో పెళ్లిళ్ల సీజన్ కూడా చేరడంతో బంగారం కొనుగోళ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం బంగారం ధర గ్రాము రూ.9 వేలు పైగా పలకడంతో లక్ష్మీరూపులను అతికష్టం మీద కొనుగోలు చేస్తున్నారు. చిన్న రూపు రూ.2 వేలు, పెద్దవి రూ.2,500, రూ.3 వేలు వరకు అమ్ముతున్నారు.



మార్కెట్లో వరలక్ష్మీ దేవి వ్రత సందడి

వ్రత నేపథ్యం..



చారుమతి అనే భక్తురాలికి లక్ష్మీదేవి కలలో కనిపించి, వరలక్ష్మి వ్రతం గురించి వివరిస్తు నోములు, వ్రతాలు, పూజల వల్ల లక్ష్మీ కటాక్షం కలుగుతుందని శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఆచరించాలి. లోకంలో స్త్రీలు సకల ఐశ్వర్యాలు, పుత్ర పౌత్రాభివృద్ధిని పొందేందుకు ఓ వ్రతాన్ని సూచించమని ఆదిదేవుడ్ని పార్వతీదేవి కోరగా ఈ వ్రతం సూచించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

పరస రాధాకృష్ణ,
టీటీడీ ధర్మ ప్రచారకులు

ఆలయాల్లో సందడి

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాలను ముస్తాబుచేస్తున్నారు. నేడు తెల్లవారుజాము నుంచే రకరకాల నైవేద్యాలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. నేడు అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన రోజు కావటంతో మహిళలు ముఖ్యంగా అమ్మవారిని దర్శించుకోటానికి దేవాలయాల ముందు బారులు తీరుతారు. ఈ నేపథ్యంలో ఆలయా కమిటీ సభ్యులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

మైనార్టీ వర్గాలే లక్ష్యంగా కూటమి దాడులు



గంగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం

దేవరపల్లి: పులివెందల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై టీడీపీ రౌడీ మూకల దాడి దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడిబోయిన గంగరాజు మండిపడ్డారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం దాడులు చేయడం సిగ్గు చేటు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం ఉప ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదని విమర్శించారు. రోజురోజుకు ప్రజల్లో పెరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకోలేక ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని, ఏడాది పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అరాచాకాలను ప్రజలు గమనిస్తున్నారని, దాడికి పాల్పడిన వ్యక్తులను తక్షణం అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నింధితులను అరెస్ట్ చేయడంలో కాలయాపన చేస్తే రాష్ట్ర బీసీ విభాగం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పురుగు మందుల వినియోగంతో అనర్థాలు

ఉండ్రాజవరం: వరి సాగులో అవసరానికి మించి రసాయనిక పురుగు మందుల వినియోగం అనర్థదాలకు దారి తీస్తుందని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు తెలిపారు. మండలంలో మోర్త గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలం పరిసరాల విశ్లేషణ అనేది పొలంబడి కార్యక్రమానికి గుండె వంటిదన్నారు. ప్రతి రైతు తన పొలంలో ఉన్నటువంటి మిత్ర, శత్రు పురుగులు, నీటి వసతి, కలుపు సమస్య, రాబోవు చీడపీడలను గుర్తించడానికి విశ్లేషణ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకరాలు దీప్తి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు విద్యార్థి

చాగల్లు: ఈ నెల మూడవ తేదీన రాజమండ్రిలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల ఎంపికలో జడ్పీహెచ్ఎస్ చాగల్లు విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 8, 9, 10 తేదీలలో చీరాలలో జరగనున్నాయి. ఈ పోటీలలో విద్యార్థి బాలనంద కిషోర్ పాల్గొంటారని పీడీ జె.విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాసవి, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

వరి చేనుకు నానో ఎరువు తప్పనిసరి



దుద్దుకూరులో వరి చేనును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

దేవరపల్లి: వరి చేనుకు నానో యూరియా, డీఏపీ ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ రైతులకు సూచించారు. మండలంలోని దుద్దుకూరులో రైతు కాకర్ల చంద్రమౌళి వరి చేనులో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. నానో యూరియా 500 మిల్లీ లీటర్ల బాటిల్లో నత్రజని సమానంగా ఉంటుందని వాటినే వాడాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. పీఎస్‌బీ, కేఆర్‌బి అనే జీవసిలీంధ్ర నాశిని వాడడం వలన అవి మొక్క జీర్ణించుకొనే స్థితికి మారతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి జి.రమేష్, డీఆర్‌సీ ఏడీ జయలక్ష్మి, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

ఉండ్రాజవరం: ప్రతి గ్రామ పంచాయతీ వర్మీ కంపోస్ట్ యూనిట్లును ఉపయోగించి చెత్త నుంచి సంపద సృష్టించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌డీవో ఏ.స్లీవా రెడ్డి సూచించారు. మండలంలో పాలంగి, మోర్త, దమ్మెన్ను గ్రామ పంచాయతీలను గురువారం ఆయన సందర్శించి, ఆ గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి, పొడి చెత్తను విక్రయించి, తడి చెత్త నుంచి వర్మీ తయారు చేయాలన్నారు వీధుల్లో చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్లల నుంచి వచ్చిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేసి పరిశుభ్రంగా అందించాలన్నారు.

చాగల్లులో రాష్ట్రస్థాయి పోటీలు

చాగల్లు: ఆగస్టు 8, 9 తేదీలలో జెడ్పీహెచ్ చాగల్లులో రాష్ట్రస్థాయి జూనియర్ టార్గెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పీడీ జె.విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు రెండు రోజులు పాటు జరగనున్నాయని, 13 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొంటారని తెలిపారు.

అక్రమాల నివారణకు డిజిటల్ చెల్లింపులు



పెరవలి మార్కెట్‌లో ఈ-పోస్ యంత్రాలను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి

పెరవలి: వ్యవసాయ మార్కెట్టు కమిటీల చెక్ పోస్టుల వద్ద అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని తీసుకువచ్చిందని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మండల కేంద్రం పెరవలి చెక్ పోస్టు వద్ద గురువారం డిజటల్ విధానంలో ఈ పోస్ యంత్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా డిజటల్ విధానంలోని ఈ పోస్ యంత్రాల ద్వారా చెల్లింపులు జరిపేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని అందుకు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఈ విధానాన్ని ప్రవేశపెడతామన్నారు. వసూళ్లలో చేతివాటం ప్రదర్శించిన అక్రమార్కులను చట్టపరంగా శిక్షించి వారి వద్ద నుంచి తిరిగి వసూళ్లు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన ఈ విధానంతో మార్కెట్టు యార్డుల ఆదాయానికి గండి పడకుండా ఉండటమే కాకుండా, ఆదాయం సమకూరుతుందన్నారు. నకిలీ రశీదులతో చేతివాటం ప్రదర్శించిన వారికి చెక్ పెడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రత్యేక అధికారి సునీల్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ కె.నిరంజన్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు కన్నీటి వీడ్కోలు



పెద్దిరాజు శవపేటికను మోస్తున్న తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ



శవపేటికను మోస్తున్న జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు

- శవపేటికను మోసిన మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు
- కన్నీటి వీడ్కోలు పలికిన పార్టీ శ్రేణులు
- పార్థివదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించిన నేతలు

దేవరపల్లి: నల్లజర్ల మండలం దూబచర్లలో రోడ్డు పక్కన బడ్డీకొట్టు పెట్టుకుని చిరు వ్యాపారం చేసుకుని జీవిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త దొబ్బిడి పెద్దిరాజు టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి వేదింపుల కారణంగా మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసందే. పెద్దిరాజు మృతదేహాన్ని గురువారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం సాయంత్రం దూబచర్ల స్వగ్రామానికి తీసుకు వచ్చారు. పెద్దిరాజు పార్థివ దేహాన్ని మాజీ హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, స్థానిక మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు

పెద్దిరాజు అంతిమ యాత్రలో జిల్లాలో పార్టీకి చెందిన వివిధ ముఖ్య నేతలు పాల్గొని శవపేటికను మోశారు. నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున అంతిమ యాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పార్టీ నేతలు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహమణ్యం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బంకా అప్పారావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి తొమ్మంద్రు రమేష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు మేడ్నీ యువరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నక్కా పండు, జిల్లా కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు శ్రీకాకొళపు ఆదిత్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, బొడుపుల బాబ్జి, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి వామిశెట్టి పరమేశ్వరరావు, మునాఫ్, తొమ్మంద్రు రవి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ గొర్రెల సాంబశివనాయుడు, చేబ్రోలు బాలాజీ, పంది సత్యనారాయణ, తోట వెంకట్రావు, పిట్టా జాన్ సుకుమార్, చిన్నినాగు యాదవ్, గోపాలపురం మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామూర్తి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీనివాస్, కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మద్దూరి నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

200 రోజులు పనిదినాలు కల్పించాలి



దేవరపల్లిలో ఏపీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కార్మికులు

దేవరపల్లి: ఏడాదిలో 100 రోజుల పని దినాలు సరిపోవడంలేదని 200 రోజుల పనిదినాలను కల్పించాలని ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద కూలీలు ఆందోళన నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీఓ జీవీ శ్రీనివాస్‌కు అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామని రోజుకు కనీస వేతనం రూ.400 ఇవ్వాలని కూలీలు కోరారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ మే 18 తర్వాత ప్రభుత్వం నుంచి వేతనాలు విడుదల కాలేదన్నారు. నిధులు విడుదలకాగానే బ్యాంకు ఖాతాకు జమ అవుతాయని ఆయన తెలిపారు. 200 రోజుల పనిదినాల కొరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని, ఉదయం 6 గంటలకు, 11.10 గంటలకు పని చేసే సమయంలో రెండు సార్లు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయవలసి ఉందని, అలా చేస్తేనే రోజు కూలీ వస్తోందని ఆయన కార్మికులకు వివరించారు. జాబ్ కార్డు కలిగిన వ్యక్తులు మాత్రమే పనులు చేయాలని, 100 రోజులు పూర్తయిన కూలీలు పనికి రావద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.భగత్, ఉండవల్లి కృష్ణారావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బాధ్యులెవరైనా కఠిన చర్యలు తప్పవు

తాళ్లపూడి: వేగేశ్వరపురం ఛాయా సోమేశ్వర స్వామి దేవస్థానం, ప్రక్కిలంక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానాల అర్చకుల ఇచ్చిన ఫిర్యాదులపై గురువారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనరసింహ గురువారం విచారణ నిర్వహించారు. అర్చకులు కొతావరపు విశ్వనాథ శర్మ, ధనుంజయలు ఇరువురు తమ జీతాలు, ఇతర ఖర్చులు చెల్లించకపోతే నిరాహార దీక్ష చేస్తామని అధికారులను హెచ్చరిస్తూ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. ఇటీవల ఈవోగా వచ్చిన నామా సూర్యప్రకాశ రావు మాట్లాడుతూ తాను బదిలీపై వచ్చిన నాటి నుంచి జీతాలు, ఇతర ఖర్చులు చెక్‌ల రూపంలో చెల్లిస్తున్నాని, గత ఈవో శివ ఉద్యోగ కాలంలో చేసిన వ్యవహారాలకు తనకు ఎటువంటి సంబంధం లేదని అధికారుల ముందే తేల్చి చెప్పారు. విచారణలో పూర్తి వివరాలు అందిన తరువాతే నిర్ణయాలు ఉంటాయని, నిధులుండి జీతాల విషయంలో ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలుంటాయని ఆయన తెలిపారు.

ముర్రు పాలతో బిడ్డకు ఆరోగ్యం

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, అవగాహన గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ బాల సరస్వతి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు రోగ నిరోధక శక్తిని అందిస్తాయని, మహిళలకు రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు ధరిచేరవని సూచించారు. అనంతరం తల్లులకు పౌష్టికాహార కిట్లును సర్పంచ్ అందజేశారు.

ఫోన్ మాట్లాడుతూ పాలు పట్టొద్దు

నిడదవోలు రూరల్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ బిడ్డకు పాలు పట్టొద్దని రేడియేషన్ వల్ల చిన్నారులకు హానికరమని ఐసీడీఎస్ సెక్టర్ సూపర్‌వైజర్లు పి.నళిని, సీహెచ్ లక్ష్మి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం, తాళ్లపాలెం, శెట్టిపేట, అట్లపాడు గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ తల్లిపాలతో రోగ నిరోధకశక్తి పెరగడంతో పాటు జీర్ణశక్తి అధికంగా ఉంటుందన్నారు.

గాయకుడికి ఆర్థిక సాయం అందజేత

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు: మండలంలోని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన దళిత సామాజిక జానపద కళాకారుడు భావన రాముకు ఆర్థికంగా సహకారం అందిచడానికి దాతలు ముందుకువస్తున్నారు. గొంతు ఇన్ఫెక్షన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాముకి గొంతు శస్త్రచికిత్స కోసం రూ.1.80 లక్షలు ఖర్చవుతోందని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల **గాయకుడి గొంతు మూగబోయింది** అనే శీర్షికతో సాక్షిలో ప్రచురించిన కథనానికి కాకినాడకు చెందిన రిటైర్డు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ వి.శ్రీనివాసరావు స్పందించారు. దాతృత్వంతో శస్త్ర చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రిటైర్డు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ వి. శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా సోలార్



కేవీకే దుర్గారావు, ఎంపీపీ, దేవరపల్లి

దేవరపల్లి: మండలంలోని ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాల కుటుంబాలకు పీఎం సోలార్ ఘర్ పథకంలో భాగంగా ఉచితంగా సోలార్ యూనిట్లు మంజూరు చేస్తున్నట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు గురువారం తెలిపారు. 2 కేవీ విద్యుత్ సోలార్ మొత్తం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. నెలకు రూ.200 చొప్పున ఇంటి అద్దె కూడా కేంద్రమే చెల్లిస్తుందని ఆయన చెప్పారు. మండలంలో 4,500 మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన గృహాలు ఉన్నట్టు ఆయన చెప్పారు. వీరందరూ ఉచితంగా సోలార్ ఘర్ ఏర్పాటు చేసుకోవచ్చునని సూచించారు. ఆధార్ జిరాక్స్, కరెంట్ బిల్లు జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ తీసుకుని యర్నగూడెం, దేవరపల్లి సబ్ స్టేషన్‌లోని అధికారులను కలసి దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. నెలకు 200 యూనిట్లు ఉచితంగా పొంద వచ్చునని ఈ అవకాశాన్ని మండలంలోని ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సద్వినియోగం చేసుకొవాలన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం టౌన్ మాస్టర్ ప్లాన్‌పై జరిగిన అఖిలపక్ష భేటీ చర్చలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వికసిత్ భారత్ –2047 ప్రణాళికలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ సారధ్యంలో దేశంలోని అన్ని ప్రాంతాలు, రాష్ట్రాల ప్రజల అభిప్రాయాలు సేకరించి తదనుగుణంగా దేశాభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. సొంత ఊళ్లో పుట్టినవారికి ఆ ప్రాంతంపై మమకారం ఉంటుందని, తమ ప్రాంతం వారు ఏ విధంగా ఉండాలని ఊహించుకుంటున్నారో అలాంటి ఆలోచనలు తెలుసుకొని పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ విజన్ రూపొందించామన్నారు. ప్రజలకు ఏమైనా ఆలోచనలు ఉంటే మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం చర్చలో పలు పార్టీల నాయకులు పట్టణ అభివృద్ధికి సంబంధించిన తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మునిస్పల్ వైస్ చైర్మన్లు షేక్ వజీరుద్దీన్, యలగాడ బాలరాజు, మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, టౌన్‌ప్లానింగ్ అధికారి ఎస్. సుప్రియ, మున్సిపల్ ఏఈఈ సామవేదం హేమంత్‌కమాల్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తాడిమళ్ల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

నిడదవోలు రూరల్: బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి పోటీలకు నిడదవోలు మండలం తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పద్మ గురువారం తెలిపారు. ఈ నెల 3న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో బి.ప్రేమ్ కుమార్, ఎస్.గ్రీష్మ, పి.శివ దుర్గలక్ష్మి (ట్రయాథ్లాన్) పి.కార్తీక్ (షాట్‌పుట్), పి.వెంకట మురళీ (100, 600 మీటర్ల పరుగుపందెం)లో ఎంపికై నట్లు ఆమె చెప్పారు.

డ్రోన్ల వినియోగంతో సత్ఫలితాలు



కలవచర్లలో డ్రోన్‌తో ఎరువుల పిచికారీని పర్యవేక్షిస్తున్న ఏవో, రైతులు

నిడదవోలు రూరల్: ఖరీఫ్ సాగులో డ్రోన్లు వినియోగించి స్ప్రేయింగ్ చేయడంతో రైతులు సత్ఫలితాలు పొందుతారని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని కలవచర్లలో ప్రకృతి వ్యవసాయ వరి పొలాలకు డ్రోన్ సాయంతో వేప గింజల ఇంగువ, చేప బెల్లం కలిపి గురువారం స్ప్రేయింగ్ చేశారు. డ్రోన్లు వినియోగం పెంచడంతో సమయంతో పాటు కూలీల కొరతను అధిగమించి పెట్టుబడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి, రైతులు దిద్దే హరిబాబు, కృష్ణారావు, శ్రీనివాస్, ఉప్పలపాటి శ్రీను, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగును నులిమేద్దాం

దేవరపల్లి: డీ వార్మింగ్ మాత్రల ద్వారా పిల్లల కడుపులోని నులిపురుగులను నులిమేద్దామని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పిలుపునిచ్చారు. ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి పిల్లవాడికి తల్లిదండ్రులు తప్పనిసరిగా మాత్రలు వేయాలన్నారు. వైద్యాధికారులు సంజీవ్ కుమార్, ప్రశాంత్ మాట్లాడుతూ ఈ నెల 12న ప్రతి పాఠశాలలోను, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మాత్రలు పంపిణీ చేస్తున్నామని 1 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలకు అర మాత్ర, 6 నుంచి 19 సంవత్సరాలు గల విద్యార్థులకు ఒక మాత్ర చొప్పున ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో వేయించాలని తెలిపారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం.తిరుమలదాస్, గౌరీపట్నం పీహెచ్‌సీ సీహెచ్ఓ శ్రీ కృష్ణుడు పాల్గొన్నారు.

పెరవలి: పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో అవగాహన కల్పించారు. కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.హేమరాజు మాట్లాడుతూ మండలంలో పిల్లలు 8,910 మంది ఉన్నారని వీరిలో కానూరు పీహెచ్‌సీ పరిధిలో 3,958 మంది ఉండగా, పెరవలి పీహెచ్‌సీ పరిధిలో 4,952 మంది ఉన్నారని వీరందరికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని ఆదేశించారు.